ఏడాదైనా పనుల్లో నిర్లక్ష్యం

- మన ఊరు–మనబడి పథకంలో 18 పాఠశాలల ఎంపిక
- ఐదు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి


సాయంపేటలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

ధర్మారం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మన ఊరు–మనబడి కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ధర్మారం మండలంలోని 18 పాఠశాలలను మన ఊరు–మనబడి కార్యక్రమం కింద ఎంపిక చేసి గత ఏడాది ఏప్రిల్‌లో పనులు ప్రారంభించారు. అయినా ఇప్పటికీ పూర్తికాలేదు.

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం..

అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించేటప్పుడు చూపించిన శ్రద్ధ పనులు పూర్తి చేయించటంలో కనిపించలేదు. దీంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. మండలంలో పనులు ప్రారంభించి ఏడాదైనా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో పనులు కాలేదు. మండలంలోని 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు 10 ప్రాథమికోన్నత పాఠశాలలు 2 ప్రాథమిక పాఠశాలలను మన ఊరు మనబడి కింద ఎంపిక చేశారు. 18 పాఠశాలల్లో కేవలం 5 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇందులో కూడా ఈజీఎస్ పథకం కింద చేపట్టిన ప్రహరీ, టాయిలెట్స్, కిచెన్ షెడ్స్ పూర్తికాలేదు. మిగతా పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయి.

20న మంత్రి చేతుల మీదుగా ప్రారంభం..

ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 20న నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా మన ఊరు మనబడి కింద పనులు పూర్తయిన అభివృద్ధి పనులను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించనున్నారు. ధర్మారంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల, కటికెనపల్లి ప్రాథమిక పాఠశాల, పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తికాగా ఈ పాఠశాలలోని అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

పథకం కింద చేపట్టిన పనులు..

మన ఊరు మనబడి కింద చేపట్టిన పనుల్లో కొన్నింటికి ఈజీఎస్ నిధులు కేటాయించారు. అయితే ఈజీఎస్ నిధులతో పనులు చేస్తే నిధులు సకాలంలో మంజూరు కావనే కారణంగా కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. దీంతో ఈజీఎస్ కింద చేపట్టిన ప్రహరీ, టాయిలెట్స్, కిచెన్ షెడ్ల నిర్మాణం చేపట్టలేదు. ఈ పథకం కింద పాఠశాలలో మంచినీటి సౌకర్యం, మరమ్మతు పనులు, విద్యుత్ సౌకర్యం, డైనింగ్ హాల్ నిర్మాణాలు, నూతన భవన నిర్మాణాలు చేయాలి. మన ఊరు మనబడి నిధులతో చేపట్టిన పనులు పురోగతిలో ఉండగా ఈజీఎస్ నిధులతో చేపట్టాల్సిన పనులు ప్రారంభించలేదు. కేవలం కటికెనపల్లి పాఠశాలలో మాత్రమే పనులు పూర్తిచేశారు.

చర్యలు తీసుకుంటా



మండలంలోని 18 పాఠశాలల్లోని విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించడానికి మన ఊరు–మనబడి కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో కేవలం 5 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పథకంలో 8 రకాల పనులు చేపట్టగా ఈజీఎస్ నిధులతో చేపట్టిన ప్రహరీ, టాయిలెట్స్, కిచెన్ షెడ్ల పనులు జరగడం లేదు. కటికెనపల్లి పాఠశాలలో మాత్రమే ఈజీఎస్ నిధుల పనులు పూర్తిచేశారు. మిగతా పాఠశాలల్లో సైతం పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటా. – ఛాయాదేవి, మండల విద్యాధికారి

పార్టీ కోసం పనిచేసేవారిని గుర్తించాలి


మాట్లాడుతున్న సూర శ్యామ్

సుల్తానాబాద్: వివిధ పార్టీల నుంచి వలస వచ్చి బీఆర్ఎస్ నుంచి ప్యాకేజీలు తీసుకున్న వారే స్టార్లు అయ్యారని, పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను అధిష్ఠానం గుర్తించాలని విద్యార్థి జేఏసీ జిల్లా కోకన్వీనర్ సూర శ్యామ్ అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్య భవనంలో విద్యార్థి జేఏసీ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల్లో విద్యార్థి జేఏసీలో పనిచేసిన వారికి లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో పార్టీలో చేరుతున్న వారు పార్టీపై పార్టీ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమంలో ఉమ్మడి జిల్లాలోని సుల్తానాబాద్ క్రియాశీల పాత్ర పోషించిందని, అనేక కేసుల్లో జైల్లోకి వెళ్లి పార్టీని నమ్ముకున్న వారిని అధిష్ఠాన వర్గం గుర్తించి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారుడు బండి సంపత్‌గౌడ్, కాశీచరణ్, మహేశ్, చంటి పాల్గొన్నారు.

బీజేపీ వైపు మొగ్గు చూపుతున్న యువత


పార్టీలో చేరిన యువకులతో సురేశ్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ వైపే యువత మొగ్గు చూపుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి వడ్లకొండ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం దాదాపు 50మందికి పైగా యువకులు పార్టీలో చేరగా సురేశ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని చూసి యువత బీజేపీలో చేరుతున్నారని అన్నారు. పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, ప్రమోద్‌కుమార్, మనోహర్, రాజవీరు, కందుల శ్రీనివాస్ ఉన్నారు. అలాగే బూత్ నెంబర్ 218లో పీఎం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు వీక్షించారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం


మాట్లాడుతున్న దాసరి ఉష

ఓదెల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. మండలంలోని పొత్కపల్లిలో ఆదివారం మనఊరు మన ఉష కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ నియోజకవర్గంలోని శ్మశాన వాటికల్లో, గుట్టల్లో గ్రామీణ క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. పొత్కపల్లిలో తాగునీటి సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. అనంతరం ఎండీ మోహిన్, శరత్, ఈశ్వర్, ప్రసాద్, కార్తీక్, మహేశ్, వర్షిత్, ఆదిత్య, చరణ్, పవన్‌కళ్యాణ్, ఎండీ జాకీ, ఎండీ పాషాతోపాటు 25మంది బీఎస్పీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ అరుణ, బీఎస్పీ మండల అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రవర్తన మార్చుకోకపోతే పీడీ యాక్ట్ అమలు


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జగదీష్

సుల్తానాబాద్‌రూరల్: రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని సీఐ జగదీష్ అన్నారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నవారు నేర ప్రవృత్తిని వీడాలని సూచించారు. శాంతిభద్రతలకు, ప్రజల హక్కులకు భంగం కలిగించినా, దాడులకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సుల్తానాబాద్, పొత్కపల్లి, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సైలు విజేందర్, రామకృష్ణ, వెంకటకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ బోనాలు


మొక్కులు చెల్లిస్తున్న పుట్ట శైలజ

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటలో పెద్దమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ మహిళలు బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమానికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, సర్పంచ్ కొండ వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాసకొండ రవి, వేణు, సంపత్, అనిల్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని న్యూఅంబేడ్కర్ నగర్‌లో రూ.4లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం బీఆర్ఎస్ నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, కోఆప్షన్ సభ్యులు ఇంతియాజ్, నీలం శ్రీనివాస్, రాసకొండ రవి, గడప కృష్ణమూర్తి, కాస రవి, నాగరాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే


ఫాదర్స్ డే వేడుకల్లో నాయకులు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. రంగంపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండి కనుకయ్యను ఆయన కుమారుడు దిలీప్ సత్కరించారు. వేడుకకు హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్ల కొమురయ్య మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రుల పాత్ర మరువలేనిదన్నారు. నాయకులు సునీల్‌గౌడ్, జగదీశ్, కుమార్, సంతోష్, రాజయ్య, వేముల రాజు, రంగు శ్రీనివాస్, విజయ్‌కుమార్, గుర్రాల రాజు, నర్సయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు మంథనికి మఠాధిపతి రాక

మంథని: శృంగేరి శివగంగ శారద మఠాధిపతి పురుశోత్తమ భారతి స్వామి సోమవారం మంథనికి వస్తున్నట్లు భక్తులు తెలిపారు. మంథనిలోని గాంధీచౌక్ వద్ద స్వాగతం పలికి శోభాయాత్ర ద్వారా శీలేశ్వర సిద్దేశ్వర దేవాలయం చేరుకుంటారని తెలిపారు. రెండు రోజుల పూజా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గోదావరిలో పుణ్యస్నానం, ఆలయాల సందర్శన ఉంటుందన్నారు.

హరితోత్సవానికి సిద్ధం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హరితోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. గ్రామీణ నర్సరీలలో పెంచిన మొక్కలను గ్రామంలో నాటేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా సంఘాల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

గ్రామగ్రామాన మంచినీళ్ల పండుగ


రామగిరి మండలం రామయ్యపల్లిలో..


జూలపల్లి మండల కేంద్రంలో..


కాల్వశ్రీరాంపూర్: సంబరాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ

కమాన్‌పూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంచినీళ్ల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి మిషన్ భగీరథ పథకంలో గ్రామాల్లో తాగునీటి కష్టాలు తొలగిపోయాయన్నారు. రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సర్పంచ్ దేవునూరి రజిత, పల్లె ప్రతిమ, బొల్లపెల్లి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఓదెల మండలంలో..

ఓదెల: రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఇంటింటా మిషన్ భగీరథ మంచినీరు అందుతోందని ఓదెల ఎంపీడీవో జి.సత్తయ్య అన్నారు. మండలంలోని హరిపురం, కొలనూర్, గోపరపల్లె, ఓదెల గ్రామాల్లో ఆదివారం మంచినీటి పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచులు కర్క మల్లారెడ్డి, గుండేటి మధు, సామ మణెమ్మ, ఆకుల ఉదయదేవి, ఎంపీటీసీ గోపు లావణ్య, కార్యదర్శులు బానుప్రసాద్, ప్రసాద్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

భగీరథ అవగాహన ర్యాలీలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎంపీపీ బాలాజీరావు, ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్ అలీ పాల్గొన్నారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల వద్ద రంగవల్లులు వేసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా అధికారులు, సర్పంచులు మహిళలు, రామగుండం మండలం ముర్మూరు వద్ద ఉన్న భగీరథ తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్, సర్పంచులు సంతోష్‌రావు, పద్మ బుచ్చన్న, రాధ, మంగ, మల్లేశం, వీరయ్య, రాజయ్య, భారతి జ్యోతిబసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: మండలంలోని రచ్చపల్లి పంచాయతీ మంచినీటి ట్యాంకు వద్ద సమావేశం ఏర్పాటు చేసి ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతి అందించారు. సర్పంచ్ కనవేన శ్రీనివాస్, కార్యదర్శి హరీశ్ ఉన్నారు.

ఎలిగేడు మండలంలో..

ఎలిగేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీళ్ల పండుగ వైభవంగా జరిగింది. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. బహుమతి అందజేశారు. ఎంపీపీ స్రవంతి, జెడ్పీ వైస్‌చైర్మన్ రేణుక పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలో ఊరూరా మంచినీటి సంబరాలు జరుపుకున్నారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపల వేట




ఓదెల: మండుతున్న ఎండలతో చెరువుల్లో నీటిమట్టం తగ్గుతోంది. దీంతో మత్స్యకార్మికులు చేపలవేటలో పడ్డారు. మండలంలోని కొలనూర్ ఓదెల, నాంసానిపల్లె గ్రామాల్లో మత్స్యకార్మికులు ఆదివారం చేపలు పట్టారు. ప్రస్తుతం ఎండలతో నీరు తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాల్లోని చెరువులతో పాటు కుంటల్లో మత్స్యకార్మికులు చేపలు పట్టడంలో నిమగ్నమయ్యారు. ఆయా చెరువులలో ఎక్కువగా రవు, బొమ్మె చేపలు వలకు చిక్కాయని మత్స్య కార్మికులు తెలిపారు.

టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

సుల్తానాబాద్: టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను విజిలెన్స్ మానిటర్ కమిటీ జిల్లా సభ్యుడు పడాల సతీశ్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

నేడు హరితోత్సవం

సుల్తానాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 19న హరితోత్సవం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. హరితోత్సవం వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం సుల్తానాబాద్ మినీ స్టేడియం ప్రాంతంలో పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ఎండిన వృక్షం



జ్యోతినగర్: రోడ్డుపక్కన ఉన్న ఎండిపోయిన చెట్టు ఎప్పుడు కూలుతుందో అని రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రానికి వెళ్లే మార్గంలో ఉన్న పెద్ద చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా ఉంది. రానున్న వర్షాకాలంలో ఈదురుగాలులకు చెట్టు విరిగి రోడ్డున వెళ్లే వారిపై పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. టౌన్‌షిప్‌కు చెందిన సంబంధిత విభాగం వారు చెట్టును తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన అనగోని రాజయ్య ఇటీవల అనారోగ్యంలో మృతి చెందగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్ మంకాలి తిరుపతి, నాయకులు కన్నం రమేశ్, మాజీ ఎంపీటీసీ ఎర్రోల్ల రాములు, కనకట్ల కొండయ్య, ఎండీ అన్వూ మియా, మల్లేశ్, స్వామి, శ్రీనివాస్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కాటం శంకరయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.22వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నీలి రాజయ్య, గుర్రం లక్ష్మిమల్లు, ఇంతియాజ్, రాసకొండ రవి, గడప కృష్ణమూర్తి, కాస రవి పాల్గొన్నారు.

చిత్ర కథ



కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ప్రధాన ఎస్సారెస్పీ కాలువ నుంచి గ్రామాలకు చేరే కాలువలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉంది. కాగా కాలువల దుస్థితి ఇలా ఉంటే చివరి భూములకు వరద నీరు ఎలా అందుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎస్సారెస్పీ అధికారులు స్పందించి తక్షణమే కాలువలు శుభ్రం చేయించి సాగునీటి సరఫరాకు అడ్డంకులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

✦మూడు ఆలయాలకు 'దూపదీపం' నైవేద్యం వర్తింపు

ధర్మారం: మండలంలోని మూడు ఆలయాలకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో దూపదీపం నైవేద్య పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం, కొత్తపల్లి గ్రామంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం, కటికనపల్లిలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలకు ప్రభుత్వం దూపదీపం నైవేద్యం పథకం వర్తింపజేసింది. ఈ ఆలయాల అర్చకులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుంది.

✦ఆంజనేయస్వామి ఆలయం ఎంపిక

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయం దూపదీప నైవేద్యం పథకానికి ఎంపికైంది. ఈ ఆలయాన్ని పథకం కింద ఎంపిక చేయడానికి కృషి చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు, సర్పంచ్ ఈర్ల మల్లేశం, ఎంపీటీసీ దండె వెంకటేశం, ఉపసర్పంచ్ రాజవ్వ, వార్డు సభ్యులు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీహైస్కూల్‌లో 1995–96 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన అప్పటి గురువులు డేవిడ్, సంపత్‌కుమార్, గోవర్ధన్, మాధవరెడ్డి, శశికాంత్‌రెడ్డి, మల్లేశం, యుగందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



ధర్మారం: మండలంలోని నందిమేడారం గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా మగ్గిడి శ్రీనివాస్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గంగపుత్ర సంఘం భవనంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మగ్గిడి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ధర్మాజి లక్ష్మీనర్సయ్య, కార్యదర్శిగా పల్లికొండ నరేశ్, కోశాధికారిగా శాఖపురం రమేశ్‌ను ఎన్నుకున్నారు.